www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 03 | జూలై | 2026
పేజీలు : 8

## సర్‌పై వామపక్షాలు, కాంగ్రెస్ ర్యాలీ




-అర్హుల ఓట్లు తొలగిస్తే ఆందోళన

2లో

# దొరకని అవినీతి అనకొండలు..!


(ఫైల్)

**ప్రజాపక్షం/ఖమ్మం :**

సమాజంలో జవాబుదారి తనం లోపించడం ముఖ్యంగా అధికారులు తమ పనులను బాధ్యతగా భావించకపోవడం ప్రభుత్వ ఉద్యోగమంటే తమ పరిధిలో ఏదైనా చేయవచ్చునన్న భావన బలపడటం భారీ అవినీతికి ఆస్కారమిస్తుంది. అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్న కొందరిని కట్టడి చేయడంలో వైఫల్యం చెందడమే అవినీతి అనకొండలు పెరగడానికి కారణమవుతుంది. ఏదో సినిమాలో చెప్పినట్లుగా తోటకూర దొంగతనం చేసిననాడే దండించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు కదా అని పశ్చాత్తాపంతో దొంగ అన్నట్లుగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవినీతిపై పర్యవేక్షణ లేకపోవడం కొందరి అవినీతి బహిరంగమే అయినా కనీస చర్యలు తీసుకోకపోవడం ఈ పరిస్థితికి కారణమవుతుంది. అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) దాడుల్లో పట్టుబడుతున్న అధికారుల స్థాయి వారి ఆస్తుల చిట్టాలు చూస్తుంటే సామాన్యులు మిగతా 2లో..

-కొందరు దొరికినా దొరలే
-అక్రమ సంపాదనలో పోటీపడుతున్న కొందరు
-ఏసిబి దాడులతో బయటపడుతున్న ఆస్తులు.. విస్తుపోతున్న ప్రజలు



## రియల్ ఉపాధ్యాయులు..!



- వెంచర్లలో ప్లాట్ల విక్రయాలు, నిర్మాణ రంగంలో చురుకైన పాత్ర
-సెలవులు పెట్టి మరీ వ్యాపారాలు
-తీవ్ర చర్చనీయాంశంగా మారిన వ్యవహారం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయుల వ్యవహారశైలి ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. విద్యాబోధన బాధ్యతలు నిర్వహించాల్సిన కొందరు ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు ఉపాధ్యాయులు పాఠశాల విధులకు భంగం కలిగేలా ప్రైవేట్ వ్యాపార కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవసరమైన సందర్భాల్లో సెలవలు తీసుకుని భూములు, ప్లాట్ల కొనుగోలు, అమ్మకాలు, నిర్మాణ పనుల పర్యవేక్షణలో కనిపిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. విద్యార్థులకు బోధన కంటే ప్రైవేట్ వ్యాపారాలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే సేవా నియమావళి ప్రకారం కొన్ని వ్యాపార కార్యకలాపాలపై స్పష్టమైన పరిమితులు ఉన్న నేపథ్యంలో ఈ వ్యవహారం మరింత చర్చకు దారి తీసింది. దీనిపై సబంధిత అధికారులు వాస్తవాలను నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల ఆస్తులు, ఆదాయ వనరులు, ఇతర కార్యకలాపాలపై మిగతా 2లో..

## దోపిడీ ముఠా గుట్టురట్టు





-పోలీసులతో కలిసి రూ. 2 కోట్ల బ్లాక్‌మనీ ఎర
-కానిస్టేబుల్, ఆర్ఎస్ఐ సహా 12 మంది అరెస్ట్
-రూ.17.60 లక్షల నగదు, మూడు కార్లు, ఒక స్కూటి, పోలీసు యూనిఫాంలు స్వాధీనం
-చాకచక్యంగా పట్టుకున్న సత్తుపల్లి పోలీసులు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రూ.2 కోట్ల బ్లాక్ మనీని వైట్‌మనీగా మారుస్తామని ఆశ చూపించి అమాయకులను వలలో వేసి, అనంతరం పోలీసులుగా నటిస్తూ డబ్బులు దోచుకునే అంతర్రాష్ట్ర డెకాయిటీ ముఠాగుట్టును రట్టు చేసింది కల్లూరు ఏసిపి వసుంధరయాదవ్ నేతృత్వంలోని సిఐ శ్రీహరి బృందం. ఈ కేసులో ఇద్దరు టిజిఎస్ పి సిబ్బందితో సహా 12 మందిని అరెస్ట్ చేసి, రూ.17.60 లక్షల నగదు, కార్లు, సెల్‌ఫోన్లు, పోలీసు యూనిఫాంలు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ మిగతా 2లో..

# దొరకని అవినీతి అనకొండలు..!

**(మొదటిపేజీ తరువాయి)** సైతం అవాక్కవుతున్నారు. ఎవరి చిట్టా చూసినా కేజీల్లో బంగారం, కోట్లలో ఆస్తులు, గుట్టలు గుట్టలుగా కరెన్సీ నోట్లు బయటపడుతున్నాయి. ఎప్పుడో ఒకసారి ఒకరిపైనో ఇద్దరిపైనో దాడి జరిగితే ఇంత అక్రమ ఆస్తి బయటపడుతుంది. మొత్తంగా అవినీతి అధికారుల ఆస్తుల చిట్టాను లాగితే ఎంత ఉంటుందో అంతు చిక్కడం లేదు. కొందరు కమిషన్ల కింగులై క్షేత్రస్థాయి చిరుద్యోగి నుంచి పై అధికారి వరకు వసూళ్లలో వాటాలు పుచ్చుకునే వారే. ఏ శాఖలోనూ పారదర్శకత మచ్చుకు కూడా కనిపించడం లేదు. గ్రామస్థాయిలో చిన్న ధృవీకరణ పత్రం ఇచ్చేందుకు మొదలవుతున్న లంచం బదిలీలు, జీవోల దాకా పాకుతుంది. కొన్ని వేలల్లో ఉంటే కొన్ని లక్షల్లో పలు సందర్భాల్లో కోట్లలో డబ్బు చేతులు మారుతుంది. ఓ మేధావి చెప్పినట్లుగా ఈ దేశానికి అసలు జబ్బు అవినీతే. అవినీతిని అంతం చేయగలిగితే పేదరికం దూరమవుతుందన్న మాటలు కోట్లలో అక్రమ ఆస్తులు బయటపడటం చూస్తుంటే నిజమే అనిపిస్తుంది.

### దొరకని అనకొండలు...

కక్కుర్తి పడి నగదు తీసుకోవడం, ఫోన్ పేలు చేయించడం మధ్య వర్తులు ఎవరైనా ఉంటే వారికి కూడా ఏమైనా వాటాలు ఇవ్వాల్సి వస్తుందని నేరుగా లంచాలు పుచ్చుకోవడం ఇతరత్రా తప్పులతో కొందరు అవినీతి నిరోధక శాఖాధికారులకు దొరుకుతున్నారు. ఇతరులపై నమ్మకం లేక మొత్తం ఆస్తులను తమ పేరే ఉంచుకోవడం ఒక మాటలో చెప్పాలంటే లంచం పుచ్చుకోవాలన్న ఆశతో తప్పించుకునే మార్గం తెలియక దొరికిపోతున్నారు. ఇలా దొరికిపోయే వారి శాతం అతి స్వల్పం. కానీ దొరకని అనకొండలు కోట్లు కూడేసుకుంటున్నారు. దశాబ్ద కాలంగా జరుగుతున్న కోట్లాది రూపాయల ప్రభుత్వ నిర్మాణాలు, అభివృద్ధి పనులకు సంబంధించి నాణ్యతను ప్రశ్నించిన నాథుడు లేడు. కింద నుంచి పైదాకా అధికారులు వాటేలేసుకోవడంతో పాటు సర్పంచ్ నుంచి చట్టసభల ప్రతినిధుల దాకా కమిషన్లు ముట్ట చెబుతున్నారు. కింద నుంచి పైదాకా కమిషన్లు పోను చివరకు జరిగే పని ఎంత, దానిలో ఉండే నాణ్యత ఎంత అనే దానిపై ఇక ఆలోచనే అనవసరం. ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తే అవినీతి అనకొండలు ఇంతగా పెరిగే వారు కాదు. ఇప్పుడు లంచం ఒక హక్కుగా మారుతుంది. దీనితో ఒకరిని చూసి మరొకరు అవినీతి పరులుగా మారడం వీరిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఈ పరిస్థితికి కారణమవుతుంది. ఎవరో ఒకరు ఫిర్యాదు చేస్తేనో లేక స్పష్టమైన సమాచారం ఉంటే తప్ప ఏసిబి దాడులు చేయడం లేదు. నిజంగా వివిధ శాఖల్లో ఉన్న అధికారులపై దాడులు చేస్తే అవినీతి మకెలంటని అధికారుల సంఖ్య ఎంతో తేలిపోతుంది.

### కొందరు దొరికినా దొరలే...

ఇటీవల కాలంలో ఏసిబి అధికారులు ప్రత్యక్షంగా లంచం తీసుకుంటుండగా దాడులు చేసి జైళ్లకు పంపుతున్నారు. కానీ కొందరు లంచాలు తీసుకుంటూ దొరికినా దొరలుగానే మిగిలిపోతున్నారు. సామాన్యులు, ప్రజాప్రతినిధులు, అవినీతి అధికారులపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. నాలుగేళ్ల కాలంలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి మండల స్థాయిలో లేదా డివిజనల్ స్థాయిలో ఓ అవినీతి అధికారి పై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏసిబి తప్ప ఓ అధికారిని ప్రశ్నించిన వారు కానీ చర్యలు తీసుకుని కనీసం బదిలీ అయిన వారు కూడా లేరంటే అతిశయోక్తి కాదు. చాలా మంది అధికారులు వివిధ సందర్భాల్లో పట్టుబడినప్పుడు రాజకీయ జోక్యంతో బయటపడుతున్నారు. ఆ విషయాన్ని వదిలేయండి కాదు కూడదంటే అక్కడి నుంచి మరో స్థానానికి బదిలీ చేయండి అన్న రాజకీయ ఒత్తిళ్ల నడుమ కొందరు దొంగలు కూడా దొరలుగా మారిపోతున్నారు. ప్రభుత్వం క్రమేపి వ్యవస్థలపై పట్టు కోల్పోతుంది. కార్యనిర్వహక వర్గం (అధికార యంత్రాంగం) అవినీతికి అలవాలమైతే ప్రజలకు అన్యాయం జరుగుతుంది. అర్హులను కాదని అనర్హులకు లబ్ది చేకూరుతుంది. ఈ విషయం పాలకులకు తెలిసినా వివిధ కారణాలతో సమర్థిస్తూ వస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరం. అవినీతిని ఎక్కడో ఒక చోట కట్టడి చేయకుండా సామాన్యులకు న్యాయం చేయడమన్నది జరగని పని అని పాలకులు గుర్తెరగాల్సి ఉంది. లేదంటే అవినీతి తాకని అధికారులను భవిష్యత్తులో చూడలేమేమో.

# సర్‌పై వామపక్షాలు, కాంగ్రెస్ ర్యాలీ




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై వామపక్షాలు, కాంగ్రెస్ గురువారం ర్యాలీ నిర్వహించాయి. ఖమ్మంలోని పాత బస్టాండ్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించాయి. ఈ ర్యాలీకి సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ తో పాటు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. బిజెపి స్వార్థ బుద్ధితో అర్హులైన ఓట్లను తొలగించాలని రాజకీయ కుట్రకు పాల్పడుతుందని నాయకులు ఆరోపించారు. ప్రజలు బిజెపి కుట్రను భగ్నం చేస్తూ జాబితా సవరణపై అవగాహన పెంచుకోవాలన్నారు. బిజెపియేతర రాజకీయ పార్టీల కార్యకర్తలు ఓటర్లకు అవగాహన కలిగించి అర్హత కలిగిన ప్రతి ఓటు ఉండేవిధంగా కృషి చేయాలన్నారు. బిఎల్‌వోలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రతి ఓటును కాపాడేందుకు ప్రయత్నం చేయాలన్నారు. బెంగాల్, బీహార్ లాంటి రాష్ట్రాల్లో సర్‌తో ఓట్లు తొలగించి లబ్ది పొందిన బిజెపి తెలంగాణలోనూ అదేవిధంగా లక్షలాది ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తుందని దీనిని అడ్డుకోవడంతో పాటు ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ ర్యాలీలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నాగండ్ల దీపక్ చౌదరి, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు అశోక్ తదితరులు ప్రసంగించగా ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, అజ్మీరా రామ్మూర్తి, సిపిఎం నాయకులు యర్రా శ్రీనివాసరావు, మాస్‌లైన్ నాయకులు రామయ్య, పుల్లయ్య, కాంగ్రెస్ నాయకులు దొబ్బల సౌజన్య, కమర్తపు మురళి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# 'రియల్' ఉపాధ్యాయులు..!

**(మొదటిపేజీ తరువాయి)**
పర్యవేక్షణ పెరుగుతున్న నేపథ్యంలో సమగ్ర విచారణ అసవరమనే అభిప్రాయలు వినపడుతున్నాయి.

### వ్యాపారాలలో చురుకుగా...

వెంచర్లలో ప్లాట్ల విక్రయాలు నిర్మాణ రంగంలో చురుకైన పాత్ర వహించడంలో అందవేసిన చేయిగా కొందరు ఉపాధ్యాయుల తీరు కొనసాగుతుంది. ఇందులో ప్రధానంగా ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని కొన్ని వార్డులలోని వెంచర్లలో నివాసం ఉంటున్న స్థానిక ఉపాధ్యాయులు వ్యాపారంలో ఆరితేరినట్లు తెలిసింది. ఓ పక్క రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ప్లాట్ల విక్రయాలకు పాల్పడటంతో పాటు మరొపక్క బిల్డర్లుగా అవతారం ఎత్తారు. అయితే ఈ వ్యాపారం ఆర్థికలావాదేవీలతో కూడుకున్నది కావడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగిగా వారి రిటైర్మెంట్ వరకు చేసిన రాణి సంపాదన వస్తుండటంతో సాగిస్తున్నారు. అంతేకాకుండా వ్యాపారంలో కీలక పాత్ర పోషించడంలో మున్సిపాలిటీపరిధిలో నివాసం ఉంటున్న పక్క మండలాల ఉపాధ్యాయులు ఉండటం విశేషం. అంతేకాకుండా మరికొందరు ఉపాధ్యాయుల సంఘాల పేర్లు చెప్పి పాఠశాలకు వెళ్లకుండా ఆర్థికలావాదేవీలు చక్కబెట్టుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### చర్యలుండేనా..?

ప్రభుత్వపాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ కొందరు ఉపాధ్యాయులు రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు, చిట్‌ఫండ్‌లు, ఇతర ప్రైవేట్ ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారనే ఆరోపణలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు ఈ ఆరోపణలపై సంబంధిత శాఖలు స్పష్టమైన విచారణ చేపట్టి చర్యలు తీసుకున్న సందర్భాలు కనిపించలేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల అక్రమాస్తులు, అవినీతి వ్యవహారాలపై అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) దృష్టి సారించి, దాడుల ద్వారా కోట్లది రూపాయాల విలువైన ఆస్తులను వెలికితీస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సేవలో కొనసాగుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కుంటున్న వారిపై విచారణ చేపట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. ఇదిలా ఉండగా మున్సిపాలిటీలో మరో వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది. మున్సిపాలిటీ ఏర్పాటుతో పాటు పుట్టిన ఓ సంఘం సభ్యులు తరుచు వేలు పెట్టడమే కాకుండా వారిపై బెదిరింపులకు సైతం దిగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. తమ చెప్పిన పని చేయకుంటే బదిలీలు కూడా చేపిచ్చేస్తామంటూ ప్రగల్భాలు పలుకుతుండటం ఇందుకు ఉదాహరణగా కనిపిస్తోంది. ఏది ఏమైనప్పటికీ ఈ వ్యవహారాలపై కళ్లెం వేయకుంటే పెట్రేగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# దోపిడీ ముఠా గుట్టురట్టు

**(మొదటిపేజీ తరువాయి)**
మాట్లాడుతూ కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన కుర్రా గంగాధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.281/2026గా కేసు నమోదు చేశామని, దర్యాప్తు అధికారి ఇన్‌స్పెక్టర్ టి. శ్రీహరి ఆధ్వర్యంలో కల్లూరు ఏసీపీ శ్రీమతి వసుంధరా యాదవ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టగా విశ్వసనీయ సమాచారం మేరకు గంగారం ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా నేరాన్ని అంగీకరించారని, దర్యాప్తులో ఈ ముఠా అమాయకులకు ఫోన్ చేసి తమ వద్ద రూ.2 కోట్ల బ్లాక్‌మనీ ఉందని, దానిని వైట్‌మనీగా మార్చుకోవడానికి సహకరిస్తే పెట్టిన డబ్బుకు నాలుగు రెట్లు ఇస్తామని నమ్మించేవారన్నారు. బాధితులు డబ్బుతో వచ్చిన తర్వాత డమ్మీ కరెన్సీ బ్యాగ్ చూపించి, అదే సమయంలో నకిలీ పోలీసుల వేషంలో అక్కడికి చేరుకుని దొంగనోట్లు లేదా నేరస్తుల పేరుతో బెదిరించి నగదు దోచుకుని పరారయ్యేవారని పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితులతో పాటు టిజిఎస్ పి 15వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ ముళ్లగిరి వర్ధన్, ఆర్‌ఎస్‌ఐ బేరా కేశవరావు కూడా పాల్గొన్నట్లు దర్యాప్తులో తేలింది. మొత్తం 12 మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు ఏసిపి తెలిపారు. రికవరీ చేసిన ఆస్తులురూ.17.60 లక్షల నగదు, 2 ఇన్నోవా కార్లు,1 ఎర్టిగా కారు, 1 టీవీఎస్ యాక్సెస్ స్కూటీ,16 సెల్‌ఫోన్లు, 2 పోలీసు యూనిఫాంలు 1, ఎస్‌ఐ యూనిఫాం సెట్1, ఆర్‌ఎస్‌ఐ యూనిఫాం సెట్‌పోలీసు పేరుతో ఉన్న టీషర్టులు, రెయిన్ కోట్లు సంకెళ్లు డమ్మీ కరెన్సీ కట్టలు (500 నోట్ల మాదిరిగా తయారు చేసిన 80 కట్టలు) పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ముఠా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా మోసాలకు పాల్పడిన అవకాశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. కేసును చేదించిన సిబ్బందికి ఏసిపి బహుమతులు అందజేశారు.సమావేశంలో ఎస్సైలు వీరప్రసాద్, అశోక్,ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా దుస్సా జగదీశ్వర్ సంతాప సభ

## - నివాళులర్పించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షన్, వెల్ఫేర్ అసోసియేషన్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని సాయి ప్రభాత్‌నగర్‌కాలనీ రోడ్ నెంబర్2కు చెందిన మాజీ జిల్లా సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్ సంతాప సభను ఏదులాపురం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షన్, వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ...విద్యారంగ అభివృద్ధికి చేసిన విశేష సేవలను కొనియాడారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో సైన్స్ విద్య అభివృద్ధికి ఆయన సేవలు చిర్మస్మరణీయమన్నారు. అలాగే ఉపాధ్యాయ సంఘం టిపిటిఎఫ్ అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించారన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళుర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఉడుగు వెంకటేశ్వర్లు, అధ్యక్షులు ఎస్ విజయ్, కోశాధికారి మల్లయ్య, కార్యదర్శి వల్లెబోయిన వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, 12వ వేతన సవరణ అమలు చేయాలి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణిలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 12వ వేతన సవరణను త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జేవీఆర్ ఓసీ జేఏసీ నాయకులు గురువారం ఎస్‌ఓఎం బెజ్జంకి రాజేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో నిర్వహిస్తున్న డిమాండ్స్ డే కార్యక్రమంలో భాగంగా, జేఏసీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు జేవీఆర్ ఓసీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. కార్మికుల హక్కులను దెబ్బతీసే నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, కార్మికుల న్యాయమైన వేతనాలు, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని 12వ వేతన సవరణను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ దారా భీమయ్య, ఐఎన్‌టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు, సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి సంపత్ కుమార్, హెచ్‌ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, ఏఐటీయూసీ బ్రాంచ్ అసిస్టెంట్ కార్యదర్శి సూర్యప్రకాశ్, ఫిట్ కార్యదర్శి ఉపేంద్రచారి, అజ్గర్, వర్యాటి శ్రీనివాస్, సీతారామరాజు, కార్తీక్, సీపీఐ జిల్లా కార్యవర్గ కార్యదర్శి దండు ఆదినారాయణ, జిల్లా ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, మండల కార్యదర్శి యోబు, నాగప్రకాశ్, మురళి, షట్టర్ బాబు, నసీం ఖాన్, బుగ్గ సుధాకర్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ శాఖలో పండిట్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలి

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న పండిట్, పీఈటీ పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి మురళీ మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దుమ్ముగూడెం మండలంలోని ఆశ్రమ పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈసందర్భంగా గిరిజన సంక్షేమ శాఖలో ఉన్న పలు సమస్యలను గుర్తించి, వాటిని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ విజయ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి జి సురేష్, మండల కార్యదర్శి బి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

**ప్రజాపక్షం/భద్రాచలం :** డ్రంగ్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష పడింది. ఈ మేరకు భద్రాచలం స్పెషల్ జ్యుడీషియల్ సెంకడ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం రాందాస్ ఈ తీర్పు వెలువరిచారు. ముగ్గురి వ్యక్తులకు రెండు రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.100 జరీమానా విధించారు. డ్రంగ్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతున్నాయని, మద్యం సేవించివాహనాలు నడిపేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

# జిల్లాలో యూరియా కొరత లేదు



**-సమృద్ధిగా యూరియా నిల్వలు**
**-యాప్ ద్వారా యూరియా కొనుగోళ్లు**
**-జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడ యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ఎటువంటి కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గురువారం తెలిపారు. వానాకాలంకు సంబంధించి ప్రభుత్వం జిల్లాకు 35,267 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో ప్రైవేటు డీలర్ల వద్ద 691.13 మెట్రిక్ టన్నులు (15359 బస్తాలు), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద 920.02 మెట్రిక్ టన్నులు (20445 బస్తాలు), మార్క్‌ఫెడ్ ఖమ్మం వద్ద 7656.16 మెట్రిక్ టన్నులు (170137 బస్తాలు), కంపెనీ గోడౌన్లలో 991.51 మెట్రిక్ టన్నుల (22034 బస్తాలు), కమీషనర్ రిజర్వ్ పుల్ (సిఆర్‌పి) లో 6898.05 మెట్రిక్ టన్నులు (153290 బస్తాలు) నిల్వ ఉన్నాయని ఆయన తెలిపారు. జూలై రెండు నాటికి జిల్లాలో మొత్తం 17156.88 మెట్రిక్ టన్నుల యూరియా (381264 బస్తాలు) అందుబాటులో ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు యూరియా యాప్ ద్వారా 56926 మంది రైతులు 180738 బస్తాలను బుక్ చేసుకుని 160316 బస్తాలను కొనుగోలు చేశారని తెలిపారు. యూరియా యాప్ ద్వారా రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను బుక్ చేసుకుని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రైతులు ఎలాంటి అపోహలకు గురి కాకుండా అవసరమైన మేర మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని తెలిపారు. ప్రతి మండల పరిధిలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతులు యూరియా లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య తెలిపారు.

## ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తగాఉండాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధి లోని 5వ వార్డులో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరాన్ని ఆ వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూపరాణి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా అక్కడున్నవారితో కట్టా స్వరూపరాణి ఆప్యాయతగా పలకరిస్తూ ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కట్టా స్వరూపరాణి మాట్లా డుతూ ప్రజలు ఆరోగ్యాల పట్ల చాలా జాగ్రత్త తీసుకోవాలని, మన పరిసర ప్రాంతాలను కూడా శుభ్రంగాఉంచుకోవాలని,అలా శుభ్రంగా ఉండటం వలన మనం మన కుటుంబం మొత్తం ఆరో గ్యంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సవాల్ విసరడం కాదు..నిలబడే దమ్ముండాలి



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** సవాల్‌ను ఎదుర్కోలేక దద్దమ్మ ప్రభుత్వం హరీశ్‌రావును అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇంఛార్జి లింగాల కమల్‌రాజు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతగాని ప్రభుత్వం సిగ్గులేని సవాల్‌చేసి తెలంగాణ భవన్‌కు వస్తానని కాంగ్రెస్ మంత్రికి సవాల్ చేస్తే సవాల్‌ను స్వీకరించి వస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావును అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలి పారు. అక్రమంగా మాజీ మంత్రి హరీశ్‌రావును అరెస్టు చేసి, ఎక్కడో కూర్చుని మళ్లీ అవే పాత డైలాగ్ కొడుతూ..చేతగాని వాడికి మాటలెక్కువ అన్నట్లు సవాల్ స్వీకరించే సత్తా లేదని, ఇచ్చిన మాట నిలబెట్టుకునే తెలివిలేదని తీవ్రంగా విమర్శించారు.

# రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



**చెరువు పునరుద్ధరణ, డబుల్ బెడ్‌రూం డ్రైనేజీ**
**కొత్త రేషన్ దుకాణం ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలో మౌలిక సదుపాయాల అభి వృద్ధికి మరో అడుగు పడింది. సుమారు రూ.3 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శ్రీకారం చుట్టారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి గురువారం పలు అభివృద్ధి కార్యక్ర మాల్లో పాల్గొన్నారు. మొదటగా వేశ్యకాంతుల చెరువు పునరుద్ధరణ ప నులకు పూజలు నిర్వహించారు. సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పనుల్లో చెరువు కట్టకు స్టోన్ పిచ్చింగ్, ఇరువైపులా స్టీల్ రైలింగ్ ఏర్పాటు, జంగిల్ క్లియరింగ్, కట్టపై నడక మార్గం అభివృద్ధి, బతుకమ్మ ఘాట్ నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే చెరువు అందంగా మారడంతో పాటు ప్రజలకు ఆహ్లా దకర వాతావరణం కల్పించబడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనం తరం జేవీఆర్ పార్కు సమీపంలోని డబుల్ బెడ్‌రూం అపార్ట్‌మెంట్ వద్ద రూ.45 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పనుల కోసం స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్, ఎంఆర్వోతో కలిసి ల్యాండ్ క్లియ రెన్స్ పనులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనం తరం అపార్ట్‌మెంట్ నివాసితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసు కుని, తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదే రో జు సత్తుపల్లి మున్సిపాలిటీ 7వ వార్డు రాజీవ్ కాలనీలో నూతన రేషన్ దుకాణం (షాప్ నం. 2229036)ను ఎమ్మెల్యే ప్రారంభించారు. లబ్ధి దారులకు స్వయంగా సన్నబియ్యం పంపిణీ చేసి, ప్రభుత్వం అంది స్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి పారదర్శకంగా అందించేం దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నరసింహ, తహశీల్దార్ పున్నం సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం కమల్ పాషా, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు తోట సుజాల రాణి, నసీమా షరీఫ్, హకీమ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మున్సిపల్ ఏఈ, ఇరిగేషన్ జేఈ, బొంతు వేణు, విరివాడ భూషణం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రేషన్ డీలర్లు,రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన యోగా శిక్షణా తరగతులు



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** మండల పరి ధిలోని రీ క్రియేషన్ క్లబ్‌లో గత పది రోజులుగా నిర్వహిస్తున్న అగస్త్య పీఠం సుగుణానంద మహర్షి ఆశీస్సులతో గురూజీ శివానంద ద్వారా యోగా శిక్షణా తరగతులు గురువారం విజయ వంతంగా ముగిసినట్లు తెలిపారు. శారీరక, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో ప్రయోజ నకరమని, జుజ్జూరు దగ్గర నరసింహాపాలెం గ్రామంలో అగస్త్య పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ సుగుణానంద మహర్షి ఆశీస్సులతో పది రోజులపాటు శిక్షణాతరగతులు రీక్రియేషన్ క్లబ్ మధి రలో నిర్వహించి, యోగాపై అవగాహన, మెలుకువలు, ఆసనాలు, ప్రాణాయామాలు తదితర యోగాపై సాధన నేర్పించినట్లు తెలిపారు. యోగా సమయంలో అమృతహారము అందించామని, ఈనెల 7వ తేదీ నుంచి రెండో బ్యాచ్ ఇదే వేదికలో ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్య క్రమంలో యోగా సాధకులు, విద్యాసంస్థల అధినేతలు,ఉద్యోగస్తులు, వ్యాపారవేత్తలు, వైద్యులు, న్యాయవాదులు గురూజీ శివానందను ఘనంగా సన్మానించారు.

## ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశం



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని బాణాపురం గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్ర మార్క గురువారం గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా ప్రతీ నిరుపేదకు సొంత ఇంటి కల నెరవే ర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నాణ్యమైన గృహాలను అందించేం దుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## శాతవాహన ఎక్స్‌ప్రెస్ ఆపాలని వినతి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం:** తెలంగాణ తిరుప తిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం స్వయంభు శ్రీ వెంకటేశ్వరస్వామి మహాకుంభాభిషేకం సం దర్భంగా ఎర్రుపాలెంలో బుధవారం రాత్రి నుం చి నిలుపుదల చేశారు. ఈ మేరకు రైల్వేశాఖ ఉన్నతాధికారులకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయ కులు నూతక్కి నరసింహారావు, ప్రయాణికుల సంఘం అధ్యక్షులు కొప్పు రవి, కమలాకర్, దేవ రకొండ కోటేశ్వరరావు, పుప్పాల చంద్రమౌళి, మల్లెల మోహన్‌రావు, పూర్ణచంద్ర, వీరభద్రం, కృష్ణయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలి

**గ్యాస్, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలి**
**ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేంసూరులో నిరసన**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మి కుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురు వారం వేంసూరు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) కార్యాల యం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యులు దండు ఆదినారాయణ, మధ్యాహ్న భోజన కార్మికుల సం ఘం ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షురాలు రంజాన్ బి మాట్లా డుతూ రెండు దశాబ్దాలకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నా ణ్యమైన భోజనం అందిస్తున్న కార్మికులు అరకొర వేతనాలతో జీవనం సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు వారి శ్రమకు తగిన గుర్తింపు ఇవ్వడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి మధ్యాహ్న భోజన కార్మికుడికి నెలకు రూ.10 వేల వేతనం అమలు చేయాలని, వంటకు అవసరమైన గ్యాస్ సిలిండర్లు, కోడిగుడ్లను ప్రభు త్వమే నేరుగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచడంతో పాటు విద్యార్థులకు అం దించే బియ్యం పరిమాణాన్ని కూడా పెంచాలని కోరారు. అలాగే కార్మి కులకు ఉద్యోగ భద్రత కల్పించి, ప్రతి సంవత్సరం రెండు జతల యూని ఫాంలు అందించాలని, పీఎఫ్, ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రతా పథకాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వయోభారంతో పదవీ విరమణ చేసే కార్మికులకు రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ అందించా లని ప్రభుత్వాన్ని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు కర్రి రాజమ్మ, సత్యావతి, బుచ్చాలు, సూరమ్మ, సామ్రాజ్యం, వెంకటేశ్వరరావు, మల్లమ్మ, సీతామహాలక్ష్మి, పార్వతి, నాగమణి, నిర్మల, సుభాన్ బి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి



**ప్రజాపక్షం/వైరా:** కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన విబిజి–రంజీ బిల్లును వెంటనే రద్దు చేసి ప్రస్తుతం అమలులో ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథ కాన్ని యధాతథంగా కొనసాగించాలని గురువారం రెబ్బ వరం, వల్లాపురం, గన్నవరం, ఖానాపురం, కొండకొడిమ గ్రామాల గ్రామపంచాయతీ కార్యదర్శులకు ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తూము సుధాకర్, సిఐటియు జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు, బాజోజి రమణ, తాలూరి నాగేశ్వరరావు, సామినేని బాబు, హుస్సేన్, సేలం విష్ణువర్ధన్‌రెడ్డి, దొంతబోయిన గంటమ్మ, గొర్రెముచ్చు నవీన్, గొర్రెముచ్చు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణా తరగతుల ఏర్పాట్లు పరిశీలించిన పాషా



ప్రజాపక్షం/భద్రాచలం : ఈనెల 7 నుండి మూడు రోజుల పాటు భద్రాచలం కేంద్రంగా జరిగే ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల ఏర్పాట్లను సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం నుండి భద్రాచలానికి చేరుకున్న ఆయన విలేకరుల సమావేశం ముగించిన అనంతరం మొదటి రెండు రోజులై 7,8 తేదీల్లో గోదావరి కరకట్ట సమీపంలోని కమ్మ సంత్రంలో నిర్వహించనున్న శిక్షణా తరగతుల ఏర్పాట్లు, వేదిక, బస తదితర అంశాలపై పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సత్రం నిర్వహాకులతో మాట్లాడి శిక్షణ తరగతులకు కావాల్సిన సదుపాయాలు కల్పించాలని, ఈ శిక్షణ తరగతుల్లో బోధించేందుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబ శివరావు, ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు వస్తున్నారని చెప్పారు. 3వ రోజైన 9వ తేది నాడు రాఘవ నిలయం రెడ్ల సంత్రంలో శిక్షణ తరగతి ఉంటుందని, రెండు జిల్లాల నలుమూలల నుండి సుమారు 250 మంది ప్రతినిధులు హాజరువుతున్నారని అన్నారు. తరగతుల విజయవంతానికి ఏర్పాటు చేయబడ్డ ప్రతినిధులు ఏలోటుపాట్లు లేకుండా చూసుకోవాలని, ముందురోజే పట్టణంలో సిపిఐ జెండాలు, తోరణాలు, ఫ్లక్సీలు ఏర్పాటు చేసి ఓ పండుగ వాతావరణంలా మార్చాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు మత్యాల విశ్వనాదం, కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, మువ్వా వెంకటేశ్వరరావు, సత్రం నిర్వాహకులు అడుసుమిల్లి జగదీష్ తదితరులున్నారు.

## సిపిఐ పోరాట ఫలితం

**-జానంపేటకు మళ్లీ 108 అంబులెన్స్**



ప్రజాపక్షం/పినపాక: జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి(పీహెచ్‌సీ)మళ్లీ "108" అంబులెన్స్ కేటాయిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సీపీఐ మండల కార్యదర్శి తోగటి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మణుగూరు తరలించిన 108 అంబులెన్స్‌ను తిరిగి జానంపేటకు తీసుకురావాలని సీపీఐ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ఈ సమస్యను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వోతో మాట్లాడి ప్రత్యేక చొరవ చూపారని చెప్పారు. నాయకుల కృషి, సీపీఐ శ్రేణుల పోరాట ఫలితంగానే జానంపేటకు 108 సేవలు పునరుద్ధరించబడినట్లు తోగటి కుమార్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

## సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నుంచి శారు కవిత బహిష్కరణ



ప్రజాపక్షం/ఇల్లందు: సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ(అశోకన్న వర్గం)నాయకురాలు శారు కవితను పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని బాధ్యతల నుంచి తొలగించి బహిష్కరించినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి బానోత్ ఉక్లా, మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సనప పోమ్మయ్య సంయుక్త ప్రకటనలో తెలిపారు. పార్టీ పేరుతో పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని చెప్పి గుడిసెవాసుల నుంచి వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేయడం, పార్టీ పేరుతో చందాలు సేకరించడం, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడం వంటి ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లాలోనూ పలువురు బాధితులు శారు కవితపై ఫిర్యాదులు చేశారని, ఈ విషయాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి అశోకన్న దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జిల్లా కమిటీ సమావేశానికి ముందే ఆమె మరో రాజకీయ పార్టీలో చేరినట్లు ప్రకటించిందని ఆరోపించారు. శారు కవితను నమ్మి ఎలాంటి చందాలు, ఆర్థిక సహాయం అందించవద్దని ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు.

## ఐటిఐలో ప్రవేశాలకు 10 వరకు గడువు పొడిగింపు

ప్రజాపక్షం/మణుగూరు: ప్రభుత్వ ఐటిఐ/ఏటీసీ లోని ప్రవేశాల కోసం మొదటి విడత ప్రవేశాల గడువు ఈ నెల 10 వరకు పొడిగించినట్లు మణుగూరు ప్రభుత్వ ప్రిన్సిపాల్ ఓ. సారంగపాణి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటిఐ / ఏటీసీలలో మొదటి విడత ప్రవేశాల కోసం ఈనెల 10వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేయడం జరిగింది. పినపాక నియోజకవర్గం పరిధిలోని మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో ఎలక్ట్రిషన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సుల్లో ప్రవేశాలు కోరుతున్నట్లు తెలిపారు. మణుగూరు ఏటీసీలలో సి ఎన్ సి, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెసింగ్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, వర్చువల్ ఎనాలసిస్ డిజైనర్ అండ్ ఫినేట్ ఎలిమెంట్ మెథడ్ కోర్సులలో ప్రదేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 10లోగా ఆన్లైన్లో తమ దరఖాస్తులను అందజేయవలెనని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఆన్లైన్ దరఖాస్తుల కోసం నేరుగా ప్రభుత్వ ఐటిఐ మణుగూరుల లో సంప్రదించాలన్నారు. మణుగూరు ఐటిఐ కోసం 9701245993, 9848853255 లకు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖా.. మజాకా..!

**-రక్త పరీక్ష కేంద్రాలు తనిఖీ చేశారు.. చర్యలు మరిచారు...**
**-పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న రక్త పరీక్ష కేంద్రాలు**
**-ప్రజల ఆరోగ్యం అధికారులకు పట్టదా..?**





ప్రజాపక్షం/వైరా: ఖమ్మం జిల్లాలో పూటకొక రక్త పరీక్ష కేంద్రం పుట్టకొస్తుంది. అనుమతులు లేకుండానే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు తీరు చూస్తే భలే భలా అనిపిస్తుంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రక్త పరీక్ష కేంద్రాలను నామమాత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకున్న వైద్య అధికారులకు ప్రజల ప్రాణాల పట్ల ఎంత శ్రద్ధ ఉందో అర్థం అవుతుంది. ఇటీవల కాలంలో ప్రజాపక్షంలో రక్త పరీక్షల పేరుతో భారీ దందా, అధికారులు నామమాత్రంగా తనిఖీ చేసిన అధికారులు కొన్నిచోట్ల నోటీసులు జారీ చేసినట్లు చేసి చేతులు దులుపుకున్నారు తప్ప వాస్తవ పరిస్థితు పట్ల చర్యలు తీసుకోలేకపోయారు అని చెప్పవచ్చును. ఖమ్మం జిల్లాలో వందలాది రక్త పరీక్ష కేంద్రాలు జిల్లావ్యాప్తంగా ఉన్నాయి. ఖమ్మం పట్టణంలోనే పెద్ద ఎత్తున రక్త పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు షుగర్ పేషెంట్లను ఆసరాగా చేసుకొని వారి ఇష్టానుసారంగా దోచుకుంటున్నారు. రకరకాల పరీక్షలను పేరుతో పీడిస్తున్నారు. చివరికి కొందరు ఇచ్చే రిపోర్ట్ పూర్తిగా తప్పుడు రిపోర్ట్‌లు అనే వాదన కూడా వినిపిస్తుంది. ఇలా తప్పుడు రిపోర్ట్ ఇస్తున్న ల్యాబ్స్‌పై ఎందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడానికి జిల్లా వైద్యాధికారులు వెనకడుగు వేస్తున్నారు. రక్త పరీక్ష కేంద్రాల పట్ల ఎందుకు అధికారులకు అంత ప్రేమ, ప్రజల రక్తాన్ని పరీక్షల రూపంతో దోచుకుంటుంటే దోచుకునే రక్త పరీక్ష కేంద్రాలకు అండగా ఉంటున్న అధికారులు ఎవరు? ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రభుత్వ నిబంధనలు పాటించని రక్త పరీక్ష కేంద్రాలు ఎన్నో ఉన్నాయి. ఈ విషయాలు వైద్యశాఖ అధికారులకు తెలిసిన కూడా ఎందుకు వాటిపై చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయడం లేదు. సీజ్ చేయడం లేదు. ప్రజలని ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న రక్త పరీక్ష కేంద్రాల పట్ల అధికారుల దొంగ వైఖరి చూస్తే పలు అనుమానాలకు తావిస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక రోగికి ఇచ్చే రిపోర్టులో తప్పిదం జరిగింది అంటే ఆ రోగి ప్రాణం ఎటు పోతుందో అర్థం చేసుకోవాల్సిన బాధ్యత ఎవరిపై ఉంటుంది. తప్పుడు రిపోర్ట్ ఇస్తున్న ల్యాబ్ నిర్వాహకులపై ఎందుకు మౌనం వైద్యశాఖ అధికారులు పాటిస్తున్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ఖమ్మం జిల్లావ్యాప్తంగా నడుస్తున్న నకిలీ రక్తపరీక్ష కేంద్రాలపై చర్యలు తీసుకొని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

# అక్కినాపురం తండాలో చిరుత సంచారం..!?

**కాలి ముద్రలు, చెట్టు ఎక్కిన ఆనవాళ్లు**





ప్రజాపక్షం/జూలూరుపాడు: మండల పరిధిలోని రాజారావు పేట సెక్షన్, వినోబానగర్ బీట్ పరిధిలోని అక్కినాపురం తండా గ్రామ శివారు రాజారావుపేట సెక్షన్‌లో చిరుతపులి సంచరించినట్లు అనుమానాలు వ్యక్తమవడంతో గ్రామస్థుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గురువారం ఉదయం అక్కినాపురంతండాకు చెందిన ఓ రైతు తన వ్యవసాయ పొలాన్ని పరిశీలించేందుకు వెళ్లగా, పొలంలో పెద్ద జంతువుకు చెందిన కాలి ముద్రలు కనిపించాయి. వాటిని గమనించిన రైతు వెంటనే గ్రామానికి చేరుకుని స్థానికులకు సమాచారం అందించడంతో పాటు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న కొత్తగూడెం అటవీ డివిజన్ పరిధిలోని జూలూరుపాడు రేంజ్ ఎఫ్ఆర్వో తేజస్వి ఆదేశాల మేరకు వినోబానగర్ బీట్ ఆఫీసర్ బి. బాలాజీ గ్రామ పెద్దలు, రైతులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టారు. పొలంలో కనిపించిన కాలి ముద్రలను పరిశీలించిన అధికారులు, సమీపంలోని ఓ చెట్టుపై జంతువు ఎక్కిన ఆనవాళ్లను కూడా గుర్తించారు. ఈ ఆనవాళ్ల ఆధారంగా చిరుతపులి సంచరించి ఉండే అవకాశముందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం అటవీశాఖ అధికారులు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో అడవి సమీపంలోని పొలాలకు ఒంటరిగా వెళ్లరాదని, చిన్నారులు, పశువుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో తేజస్వి మాట్లాడుతూ, సంబంధిత ప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. ఎక్కడైనా చిరుత కనిపించినా, కాలి ముద్రలు లేదా ఇతర అనుమానాస్పద ఆనవాళ్లు గుర్తించినా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వదంతులను నమ్మకుండా అధికారులకు సహకరించాలని సూచించారు. చిరుత సంచార సమాచారం నేపథ్యంలో అక్కినాపురం తండా, వినోబానగర్ బీట్ పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండగా, అటవీశాఖ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

# ‘మీషో’ ఆన్‌లైన్ మాయాజాలం..!

**- తప్పుడు డెలివరీలతో మోసం**
**- వినియోగదారులను మాయ చేస్తున్న సంస్థ**
**- నిర్ఘాంతపోతున్న ప్రజలు**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : మీ షో ఆన్‌లైన్ మార్కెటింగ్ యాప్ మాయాజాలాలకు పాల్పడుతోంది. ఈ కామర్స్‌కు అలవాటుపడ్డ ప్రజలు ఏ వస్తువునైనా నేడు ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌లలోనే బుక్ చేసుకుంటున్నారు. ఈ విధానం కొంత వరకు పారదర్శకంగానే సాగుతున్నప్పటికీ పెద్దఎత్తున మోసాలు చోటు చేసుకుంటున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్ కొనుగోలు దారులు ఆర్డర్ చేసే వస్తువు ఒకటైతే డెలివరీ అయ్యే వస్తులు మరొకటిగా ఉంటోంది. కొన్ని సందర్భాల్లో మనస్సులు నొచ్చుకునే విధంగా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గత కొన్ని రోజుల క్రితం భద్రాచలానికి చెందిన ఓ వ్యక్తి మీ షో షాపింగ్ యాప్ ద్వారా చెప్పులను కొనుగోలు చేశాడు. ఆ చెప్పులు పెట్టిన ఆర్డర్ ప్రకారమే ఇంటికి చేరుకున్నప్పటికీ సైజులో తేడాలు రావడంతో వెంటనే మీ షో యాప్ ద్వారా ఉన్న రిటర్న్ పాలసీ ఆధారంగా వెనక్కు పంపించి పెద్ద సైజు చెప్పులను తిరిగి ఆర్డర్ పెట్టారు. అయితే ఆ ఆర్డర్ జూలై 1వ తేది నాడు చేరుకున్నప్పటికీ కవర్ చింపి బాక్స్ తెరిచి చూడగా అందులో పాత చెప్పులు, చిరిగిపోయిన బూట్లు, అరిగిపోయిన చెప్పులు ముక్కలు ముక్కలుగా దర్శనమిచ్చాయి. దీంతో ఖంగుతిన్న ఆన్‌లైన్ కొనుగోలు దారుడు వెంటనే వాటిని ఫొటో తీసుకుని అదే యాప్‌లో రిటర్న్ పట్టారు. ఎంతో ఆశతో ఆన్‌లైన్ ద్వారా షాపింగ్ చేసినప్పటికీ మోసాల పాలు కావల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరు మార్చడం దుర్మార్గం

**- జాతిపితను అవమానించిన మోడీ : ఎస్‌కే సాబీర్ పాషా**
**- ఆ ఐదు గ్రామపంచాయితీలు తెలంగాణకు ఇవ్వాలి**
**-7,8,9 తేదీల్లో సిపిఐ ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు**



ప్రజాపక్షం/భద్రాచలం : మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయఉపాధి హామీ పథకం పేరును కేంద్రంలోని బిజేపి ప్రభుత్వం విబిజి రామ్‌జీ పథకంగా పేరు మార్చడం దుర్మార్గమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. గురువారం స్థానిక రాఘవనియలం రెడ్ల సత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకాన్ని కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్రలను పన్నిందని, కేంద్ర బడ్జేట్‌లో నిధులు కోతను పెట్టారని, కొన్ని రాష్ట్రాల్లో ఒకరకమైన చెల్లింపులు ఉంటే ఇంకొన్ని రాష్ట్రాల్లో ఇంకోరకమైన చెల్లింపులు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోని ప్రజలంతా ఒక్కటే అయినప్పుడు వేర్వేరు వేతనాలు ఏంటని ప్రశ్నించారు. మోడి తీరు జాతిపితను అవమానించే విధంగా ఉందని, ఈ పథకం ఉద్దేశ్యాన్ని నీరుగార్చే పద్ధతి మానుకుని, నిధులు పెంచాలన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపిలో కలిపిన ఐదు పంచాయితీలని తెలంగాణకు ఇవ్వాలని అన్నారు. ఈ సమస్య పరిష్కారంలో కోసం అనేక పోరాటాలు, పాదయాత్రలు చేశామని చెప్పారు. అధికార రాజకీయ పార్టీల నాయకులు దీనిపై స్పష్టమై వైఖరిని ప్రదర్శించాలని, రెండు తెలుగు రాష్ట్రాలు కేంద్రంతో చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఇక్కడి అభివృద్ధి చేసేందుకు కనీసం జాగకూడా లేదని, ఆ ఐదు పంచాయితీలు కలపడం ద్వారా వందలాది ఎకరాల భూమి వస్తుందని, తద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. భద్రాద్రి అభివృద్ధిని గత పాలకులు విస్మరించారని, రామాలయాభివృద్ధికి ఇచ్చిన మాటను నిలుపుకోలేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రామాలయాభివృద్ధికి నిధులు విడుదల చేయడం సంతోషమని, ఆ నిధులు దుర్వినియోగం కాకుండా నాణ్యతతో కట్టడాలు కట్టాలని కోరారు. భవిష్యత్ పోరాటాల రూపకల్పన ఇక్కడి నుండే ప్రారంభం కానుందని మొదటి రెండు రోజులు కమ్మ సత్రంలో చివరి రోజైన 9వ తేది రాఘవ నిలయం రెడ్ల సత్రంలో ఉంటుందన్నారు. ఈ శిక్షణా తరగతులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తారని, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, మన కర్తవ్యం అనే అంశాన్ని బోధిస్తారన్నారు. అదేవిధంగా మార్క్సిజం సమకాలీన సమాజంలో దాని పాత్ర అనే అంశాన్ని యుగల్ రాయలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో భారత దేశం, పర్యవసానాలు అనే అంశపై మోహన్ రెడ్డి, భారతీయ చరిత్ర, సంస్కృతి, అర్ఎస్ఎస్ వక్రీకరణను సోమసుందర్, మతం మతోన్మాదం, కేంద్రంలో అమలువుతున్న హిందుత్వ ఎజెండా పై ఎస్ వేణుగోపాల్, సిపిఐ ఎదుర్కొంటున్న సవాళ్లు, అధిగమించే మార్గాలపై ప్రెస్ అకాడమి చైర్మన్ కె శ్రీనివాసరెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ విప్లవోద్యమ చరిత్ర పై చలసాని వెంకటరామారావు, విప్లవపార్టీ ఆవశ్యకత, పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణం పై బాగం హేమంతరావు బోధించనున్నారు. ఈ మూడు రోజుల శిక్షణా తరగతులను జయప్రథం చేసేందుకు అంతా కృషి చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాదం, కల్లూరి వెంకటేశ్వరాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, మువ్వా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సంఘటిత పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

**- ఆటోకార్మికుల సంక్షేమానికి నిరంతర పోరాటం**
**- ఇంధన ధరల నియంత్రణ, సామాజిక భద్రత కల్పించాలి**
**- యూనియన్‌లో చేరిన 150 మంది ఆటో డ్రైవర్లు**
**- కంచర్ల జమలయ్య**






ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సంఘటిత పోరాటాలతోనే ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, కొత్తగూడెం సిపిఐ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. శేషగిరి భవన్‌లో గురువారం ఏఐటియూసి అనుబంధ ఆటోవర్కర్స్ యూనియన్ 15వ పట్టణ మహాసభ యూనియన్ అధ్యక్షులు ఉబ్బులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు వివిధ అడ్డాల నుంచి పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు, కార్మికులు హాజరై సభను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ ఆటోకార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఉపాధి భద్రత కోసం ఏఐటియూసి నిరంతరం పోరాడుతుందన్నారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. పెరుగుతున్న ఇంధన ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా ఆటో కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సామాజిక భద్రత, ప్రమాద భీమా, పెన్షన్ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. మహాసభలో యూనియన్ బలోపేతం, సభ్యత్వ నమోదు విస్తరణ, కార్మికుల హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన కార్యాచరణపై పలు తీర్మాణాలను ఆమోదించినట్లు ఆయన పేర్కొన్నారు.

**ఏఐటియూసిలో భారీ చేరికలు :** కాగా ఈ మహాసభలో వివిధ అడ్డాల నుండి 150 మంది ఆటో డ్రైవర్లు యూనియన్‌లో చేరగా కంచర్ల జమలయ్య వారికి కుండవాలు కప్పి సంఘంలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతన యూనియన్‌లో చేరిన ఆటో వర్కర్లు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ఏఐటియూసి ఆధ్వర్యంలో ఐక్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫయామ్, మద్రి కృష్ణ, ఆరెల్లి కృష్ణ, అబ్బులు, విజ్జి, బాబు, జానీదేశీ, బొట్టు శ్రీను, మంద శ్రీను, జలీల్, గౌస్, చింటు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కురం రవి ముదిరాజ్

**నమ్మకానికి దక్కిన గుర్తింపు**



ప్రజాపక్షం/మణుగూరు: కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేసిన నాయకుడికి వచ్చిన అవకాశం గతంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మణుగూరు యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం అప్పటినుండి కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పదవులు ఉన్నా లేకపోయినా పార్టీని నమ్ముకుని ఏ ఎన్నికలు వచ్చినా ముందుండి కష్టపడి పనిచేసి పార్టీ గెలుపులో కీలక పాత్ర వహిస్తూ క్రియాశీలక రాజకీయాల్లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకొని స్థానిక ఎమ్మెల్యేకి, పార్టీకి అందుబాటులో ఉంటూ గురువారం మణుగూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కురం రవి ముదిరాజ్ ముదిరాజ్ మాట్లాడుతూ టీపీసీసీ, డిసిసిల ఆదేశాల మేరకు, జనాభిమాన నాయకులు, అభివృద్ధి ప్రదాత, పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి అంకితభావంతో పనిచేస్తూ, పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానని, మండల, పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నానని నాపై విశ్వాసంతోటే మణుగూరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా నియమించారన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని ఆయన అన్నారు.తమ కుటుంబం మొదటినుంచి పార్టీ కి చేసిన సేవలను గుర్తించి గౌరవ బాధ్యతను అప్పగించి, తనపై విశ్వాసం ఉంచిన పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీకి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీని మణుగూరు పట్టణం లో మరింత బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తానని, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు.

## ఎన్నో ఏళ్ల దారికి మోక్షం

**-సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపిన కాలనీ వాసులు**



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామం ఎస్సీ కాలనీ(సర్వయ్యగుంపు)లో ముత్యాలమ్మ గుడి నుంచి క్రికెట్ గ్రౌండ్‌కు వెల్లే రహదారిపై గురువారం గ్రావెల్ పనులు స్థానిక సర్పంచ్ మచ్చ నరసింహారావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఈ రహదారి సమస్య పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని సర్పంచ్ వెంటనే స్పందించి పనులు ప్రారంభించడంతో కాలనీ వాసులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బారాజు సంపత్, బచ్చు వెంకటరమణ, సామకూరి వెంకన్న, పంచాయితీ గుమస్తా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## అశ్వాపురం మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ఓరుగంటి రమేష్ బాబు



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ఓరుగంటి రమేష్ బాబును నియమించారు. ఈసందర్భంగా గురువారం అశ్వాపురం మండలం( ఓరుగంటి వీర య్య భవన్)కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఓరుగంటి రమేష్ బాబును నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఓరుగంటి రమేష్ బాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, జిల్లా అధ్యక్షురాలు తోట లక్ష్మీ ప్రసన్న, ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఊస అనిల్ కుమార్, గొల్లపల్లి నరేష్ కుమార్, వేముల విజయ్, తాటి రాంబాబు, సోడే వెంకటేశ్వర్లు, సోడే నరసింహారావు, తాటి శ్రీను, కాసర్ల నరసయ్య, ఎస్కే మోహారాజ్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పూలపల్లి సుధాకర్‌రెడ్డి నియామకం



ప్రజాపక్షం/బూర్గంపాడు: కాంగ్రెస్ పార్టీ బూర్గంపాడు మండల అధ్యక్షుడిగా పూలపల్లి సుధాకర్‌రెడ్డిని నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీని మండల స్థాయిలో బలోపేతం చేయడం, క్యాడర్‌ను క్రియాశీలంగా ఉంచడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత పెంపొందించడం లక్ష్యంగా ఈ నియామకం జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనే సుధాకర్‌రెడ్డి మండల అధ్యక్షుడిగా పని చేసి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన అనుభవం, చురుకుదనం, పార్టీ పట్ల నిబద్ధతను గుర్తించి ఈ బాధ్యత అప్పగించినట్లు పేర్కొన్నారు. మండల అధ్యక్షుడిగా నియమితులైన అనంతరం పూలపల్లి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నాపై ఉంచి నమ్మకాన్ని వమ్ము చేయనని, మండలంలో పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు. ఈ నియామకాన్ని కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ సుధాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/కూసుమంచి : ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి బాబు బుధవారం ఆకస్మికంగా సందర్శించి కళాశాల పనితీరును సమీక్షించారు. ఈసందర్భంగా ప్రథమ సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్లు, యూడిఐఎస్ఈ వివరాలు, హాజరు, విద్యా ప్రమాణాలు, నిర్వహణ అంశాలపై ఆయన సమగ్రంగా ఆరా తీశారు. టీచింగ్ డైరీలు, అటెండెన్స్ రిజిస్టర్లు, అకడమిక్ రికార్డులు సహా పలు రికార్డులను పరిశీలించి అధ్యాపకులకు అవసరమైన సూచనలు అందించారు. నూతన కళాశాల తొలి బ్యాచ్‌లోనే 90శాతం ఫలితాలు సాధించడం రాష్ట్రానికే గర్వకారణమని ఆయన ప్రశంసించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి వీరభద్రరావు మాట్లాడుతూ నాణ్యమైన విద్య, క్రమ శిక్షణ, పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందించేందుకు అధ్యాపక బృందం కృషి చేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## యార్లగడ్డ కుటుంబాన్ని పరామర్శించిన రేగా

ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం గ్రామానికి చెందిన హెవీ వాటర్ ప్లాంట్ ఉద్యోగి యార్లగడ్డ బలరాం తల్లి యార్లగడ్డ సువర్ణలత అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ పినపాక ఎంఎల్ఏ రేగా కాంతారావు వారి స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కందుల కృష్ణార్జునరావు, కంచుగట్ల వీరభద్రం, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





**ప్రజాపక్షం/వైరా/కొణిజర్ల:** ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని, ఆరోగ్యంగా ఉంటేనే పిల్లల చదువు మీద శ్రద్ధ చూపెడతారని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రత, తరగతి గదులు, మరుగుదొడ్లు, త్రాగునీటి, వసతి, వంట గది నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ మధ్యాహ్న భోజనం చేశారు. పిల్లలకు వడ్డిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. భోజనం రుచిగా ఉందా, మెనూ ప్రకారం గుడ్డు, వెజిటబుల్ బిర్యాని, పప్పు, సాంబారు అందిస్తున్నారా, ఆహారం పరిశుభ్రంగా తయారవుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో కీలకమని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, మధ్యాహ్నం భోజనంలో సన్నబియ్యం వినియోగించాలని, ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసి తాజా కూరగాయలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులతో నిరంతరం సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం, మెరుగైన మౌళిక సదుపాఆయలు కల్పించడం ద్వారా ప్రభుత్వ విద్యపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల తహశీల్దార్ అరుణ, వైరా మున్సిపల్ కమీషనర్ రామచందర్‌రావు, ఎంఈవో చావా శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించిన కమిషనర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య గురువారం పరిశీలించారు. ఈ సందర్బంగా ఫారాల పంపిణీ పూర్తి స్థాయిలో జరిగిందా ఎక్కడైనా పెండింగ్‌లో ఉందా వంటి అంశాలను సంబంధిత ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, బిఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. ఫారాల సేకరణ ప్రక్రియను పరిశీలించి, మ్యాపింగ్ కానీ ఓటర్లు ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 ధృవీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి సిద్దంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. సేకరించిన ఫారాలు పూర్తిగా నింపారా లేదా అనే విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. యాప్‌లో వివరాలు నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తతతో పని చేయాలని కమిషనర్ తెలిపారు. ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, బిఎల్‌వోలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

**ఎన్యూమరేషన్ ప్రక్రియపై సమీక్ష :**
ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియపై ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, బిఎల్‌వోలతో కమిషనర్ అభిషేక్ అగస్త్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం 55 శాతం మ్యాపింగ్ పూర్తయిందని మిగిలిన మ్యాపింగ్‌ను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. మ్యాపింగ్ పూర్తి అయినంత వరకు ఆరు రోజుల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. డిజిటలైజేషన్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు. ఫారాలు సేకరించే సమయంలో ఏమైనా తప్పులు ఉంటే సరిచేసి డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. డిజిటలైజేషన్‌లో ఎటువంటి పొరపాట్లు లేకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, బిఎల్‌వోలు ప్రతి రోజు మధ్యాహ్నం వరకు ఫారాల సేకరణ అనంతరం డిజిటలైజేషన్ పనులు చేపట్టేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. డిజిటలైజేషన్‌ను నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.

# అధిక సాంద్రతలో పత్తి సాగు లాభదాయకం

**-జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** అధిక సాంద్రతలో పత్తి సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. రఘునాథపాలెం రైతు వేదిక నందు గురువారం జరిగిన కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రత పథకం కపాస్ కాంతి కింద అధిక సాంద్రతలో పత్తి సాగు చేయు విధానానికి సంబంధించి ఉచిత పత్తి విత్తనాలను రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అందజేశారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ఆధునీక పద్దతులైనా అధిక సాంద్రత పద్దతి, దగ్గర సాళ్ల పద్దతి ద్వారా పత్తిని సాగు చేయడం ద్వారా పంట కాలం 150 రోజులకు తగ్గించుకుని అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. ఈ విధానంలో మొక్కల సంఖ్యను కూడా పెంచుకోవచ్చునని తెలిపారు. ఈ విధానంలో పత్తి పంట మొత్తం ఒకేసారి పూత, కాయ దశకు చేరుకుని కాయాలన్ని ఒకేసారి పక్వానికి వచ్చి పత్తి తీయడం కూడా ఒకేసారి జరుగుతుందని దీని వల్ల అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ విధానం ద్వారా నవంబర్ నాటికి పత్తి పంటను పూర్తి చేసుకుని రెండవ పంటగా యాసంగిలో అపరాలు సాగు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ విధానం వల్ల ఎకరానికి 12 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పిడి సరిత, ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవోలు, వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చేతన ఫౌండేషన్ రాత పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండలంలోని మిట్టగూడెం ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గురువారం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కోశాధికారి ముత్తినేని సురేశ్ మాట్లాడుతూ..గతంలో ఇదే పాఠశాలకు సాంకేతిక విద్యాభివృద్ధికి ల్యాప్‌టాప్స్, డిజిటల్ టీవీ అందించామని, విద్యార్థుల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందించి, వారి చదువును ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శాంతి, ఫౌండేషన్ సభ్యుడు చంద్రకాని నవీన్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసచారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# విపత్తులపై ప్రజలకు అవగాహన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మున్నేరు నదిఒడ్డు, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు విపత్తులపై అవగాహన కల్పించారు. గురువారం ఖమ్మం నగరంలోని 29వ డివిజన్ ప్రొ॥ జయశంకర్ పార్కులో విపత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో ఎన్‌డిఆర్‌ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) టీమ్ కమాండర్ బ్రిటన్ సింగ్, కో ఆర్డినేటర్ సందీప్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం పాల్గొని వరదల వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, సురక్షిత ప్రాంతాలకు తరలింపు విధానం , అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన భద్రతా చర్యలు, రక్షణ మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మున్నేరు పరిసర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలని అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, వరదల సమయంలో ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ జి. అనిల్ కుమార్, హార్టికల్చర్ అధికారి బెల్లం రాధిక, డిఈ నరేందర్, ఏఈ ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్లు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు తప్పిన పెను ప్రమాదం

## ఆర్‌టిసి బస్సుకి ఊడిన ముందు టైర్





**ప్రజాపక్షం/వైరా:** భద్రాచలం నుండి ఖమ్మం వెళుతున్న ఎక్స్‌ప్రెస్ బస్ వైరా మండలం స్టేజిపినపాక సమీపంలోని వైరా నది బ్రిడ్జి వద్దకు రాగానే ఒక్కసారిగా బస్సు ముందు భాగంలోని టైర్ పూర్తిగా ఊడిపోయింది. డ్రైవర్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే భద్రాచలం నుండి ఖమ్మంకు వెళ్లేందుకు ఆర్‌టిసి బస్సు ప్యాసింజర్లతో బయల్దేరి వస్తున్న సందర్భంలో వైరా మండలం స్టేజిపినపాక వైరా నది బ్రిడ్జి పైకి రాగానే ఒక్కసారిగా బస్సు ఎదరభాగంలోనే ఉన్న టైర్ పూర్తిగా ఊడిపోయింది. పరిస్థితిని గమనించిన డ్రైవర్ వెంటనే బస్సెని అప్రమత్తం చేయడంతో బస్సులో ఉన్న 25 మంది ప్రయాణీకులు సురక్షితంగా ప్రమాదా బారి నుండి బయటపడ్డారు. వైరా నది బ్రిడ్జిపై తరచుగా ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. కాని ఆర్‌టిసి డ్రైవర్ జాగ్రత్తతో పెను ప్రమాదమే తప్పిందని చెప్పవచ్చును. ఒక్కసారిగా బస్సు ఎటు దూసుకుపోకుండా బ్రిడ్జి పైనే ఆపడంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రదేశానికి వెళ్లి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# మున్సిపాలిటీలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. తొలిరోజే మున్సిపాలిటీపరిధిలోని 10వార్డులో విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీలు శుభ్రపరిచే పనులు, చెత్త తొలగింపు, ఓపెన్‌ప్లాట్లలో పేరుకుపోయిన వ్యర్థాలు, మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకులను సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత తన 23వ వార్డులో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించిన అనంతరం పలు వార్డులను సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు బానోత్ ప్రసాద్, కడవ నవీన్, బుర్రా మహేష్, దివ్య, పూల్‌చంద్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, వీరన్న, టెలికాం డైరెక్టర్ రంజీత్‌నాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు నెల్లూరి వినోద్, బానోత్ హరి తదితరులు పాల్గొన్నారు.

# వైరా మధిర రోడ్డు డివైడర్‌ను పరిశీలించిన కట్ల



**ప్రజాపక్షం/వైరా:** నూతనంగా నిర్మిస్తున్న వైరా మధిర రోడ్డు డివైడర్ నిర్మాణం పనులను వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ పరిశీలించారు. రోడ్డు మధ్య ఎక్కడ ఎగ్జిట్ పాయింట్స్ ఇచ్చినట్లయితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందో అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ వసుంధర, చెరుకూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# భూక్యా నర్సింహారావుకు ఘన సత్కారం



**ప్రజాపక్షం/వైరా:** వైరా నియోజకవర్గ కేంద్రంలోని మిస్టర్ చాయ్ టీ అండ్ కేఫ్‌ను సేవాలాల్ సేన అగ్ర నాయకత్వం గురువారం సగర్వంగా సందర్శించింది. సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు హుసేన్ నాయక్ వైరా విచ్చేసి సంస్థ జిల్లా గౌరవ అధ్యక్షుడు భూక్యా నర్సింహారావుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన అగ్రనేతలు ఇరువురు కలిసి భూక్యా నర్సింహారావును శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ విశేష కార్యక్రమంలో సేవాలాల్ సేన కొణిజర్ల మండల అద్యక్షుడు దేవేందర్, వైరా నియోజకవర్గ ఇంచార్జ్ లవకుశ, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే రైతులకు స్థిర ఆదాయం

**-ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి**
**-జిల్లా కలెక్టర్ దివాకర్**



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఆయిల్ ఫామ్ సాగుతో పాటు ప్రత్యామ్నాయ(అంతర)పంటలను సాగు చేస్తే రైతులకు నెలవారీ స్థిర ఆదాయం లభిస్తుందని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ అన్నారు. గురువారం మండలంలోని గార్లొఒడ్డు గ్రామంలో రైతు కట్టా హరినాథ్ బాబు సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ తోటను సందర్శించి సాగు విధానం, దిగుబడులు, ప్రభుత్వ రాయితీల అమలును పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మొక్కలు, నిర్వహణ వ్యయం, డ్రిప్ ఇరిగేషన్, అంతర పంటల సాగుకు గణనీయమైన రాయితీలు అందిస్తోందన్నారు. నాలుగేళ్లపాటు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆయిల్ ఫామ్ సాగు వైపు అడుగులు వేయాలని సూచించారు. రైతు కట్టా హరినాథ్ బాబు మాట్లాడుతూ తనకు ఉన్న 10 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు ద్వారా ప్రతి సంవత్సరం సుమారు రూ 8లక్షల ఆదాయం వస్తోందని, ఎకరానికి సగటున రూ 80వేల వరకు ఆదాయం లభిస్తోందని తెలిపారు. ఈ పంట వల్ల ప్రతి నెల జీతంలా స్థిరమైన ఆదాయం వస్తోందని తన అనుభవాన్ని కలెక్టర్‌తో పంచుకున్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆకుల వేణు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ తోటల్లో కోకో, వక్క, కూరగాయలు వంటి అంతర పంటలు సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సాంకేతిక సహాయంపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర్, ఆయిల్ ఫామ్ సాగుపై రైతుల్లో మరింత అవగాహన కల్పించి, ప్రభుత్వ పథకాలను ఎక్కువ మంది రైతులకు చేరవేయాలని ఉద్యాన శాఖ అధికారులకు ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఉద్యాన శాఖ అధికారి ఆకుల వేణు, గోద్రెజ్ ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకం గ్రామాల పర్యావరణ అభివృద్ధికి బలమైన పునాది

**-జిల్లా అదనపు కలెక్టర్ విద్యా చందన**



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** మొక్కల పెంపకం గ్రామాల పర్యావరణ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) విద్యా చందన అన్నారు. గురువారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా సీతారామపురం ఏకలవ్య పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సమూహ మొక్కల నాటింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. అలాగే ప్రగళ్లపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని యంబాడి అర్జునరావు రైతు పొలంలో బీబీజీరాంజీ పథకం కింద మంజూరైన నిమ్మ, కొబ్బరి మొక్కల పెంపకంలో భాగంగా కొబ్బరి మొక్కను నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఇంటి పరిసరాల్లో, పాఠశాలలు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించవచ్చని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వీబీజీరాంజీ సిబ్బంది, సెర్ప్ సిబ్బందితో వెదురు మొక్కల పెంపకం, అలాగే ఘన వ్యర్థాల నిర్వహణలో నాలుగు రకాల చెత్త వేరు వేరు చేయడంపై అవగాహన కల్పించారు. నారాయణరావుపేట గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌ల కుట్టు కేంద్రాన్ని కూడా ఆమె పరిశీలించారు. ఈకార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్ వివేక్‌రామ్, ఎంపీవో వీరారెడ్డి, ఏపీవో సుకన్య, ఏపీఎం జగదీష్, సిబ్బంది, సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రతీ కార్యకర్త పాల్గొనాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతీ కార్యకర్తా, నాయకులు పాల్గొని ప్రతీ ఓటును కాపాడాలని బిఆర్ఎస్ నియోజవర్గ ఇంచార్జ్ రావులపల్లి రామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న 179 పోలింగ్ బూత్‌లలో కార్యకర్తల ఉత్సాహంగా పాల్గొని న్యాయమైన ఓటును కాపాడేందుకు పనిచేయాలన్నారు. అనంతరం మానె రామకృష్ణ మాడ్లాడుతూ రాబోయే కాలం గులాబీ జెండాదే అని, కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాలని, నిబద్దత గల కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ప్రబోద్ కుమార్, రేపాక పూర్ణ చంద్రరావు, సునీల్ కుమార్, గోపి, గోసుల శ్రీనివాస్, కావూరి సీతామహాలక్ష్మి , తెల్లం కామేశ్వరి, కణితి రాధా, ఎండి ముంతాజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మోర్ సూపర్ మార్కెట్‌లో తనిఖీలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** పట్టణ పరిధి అంబేద్కర్ సెంటర్‌లోని మోర్ సూపర్ మార్కెట్‌ను ఫుడ్ ఇన్స్‌పెక్టర్ శరత్ గురువారం తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా ఆహార పథార్థాలను పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మోర్‌లో కాలం చెల్లిన ఆహార పథార్థాలు విక్రయిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు తనిఖీ చేశామన్నారు. శాంపిళ్ళను లాబ్‌కు పంపిస్తున్నామని చెప్పారు.

# ముమ్మరంగా గ్రామ సమాఖ్య భవన నిర్మాణాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఐకెపి గ్రామీణ నిరుపేదల సంస్థ ఆధ్వర్యంలో గ్రామ సమైక్య భవన నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నవి. మండలంలో 22 గ్రామ సమైక్యల భవనాలు మంజూరు కాగా 19 భవనాలు పలు దశలో ఉన్నాయని కొర్లగూడెం, భవనం పూర్తి కాగా పేరు వంచ, పూర్తి కావచ్చిందని ఒక్కో భవనం ఐకెపి ఆధ్వర్యంలో రూ 10 లక్షలు తో నిర్మించే ఈ భవనం త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వాదేశాలు ఉండగా ముమ్మరంగా భవన నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయని ఐకెపిఎపిఎమ్ అశోక రాణి, పంచాయతీ రాజ్ అధికారి రాజా లు తెలిపారు. ఈ భవనాలలో మహిళలు నెలవారి సభలు సమావేశాలు అప్పులు పొదుపులు వారు ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సమీక్షలు నిర్వహించేందుకు వినియోగించుకునేందుకు ఈ భవనాలు ఉపయోగపడతాయని అధికారులు పేర్కొంటున్నారు. మండలంలోని ఈ సమైక్య భవన నిర్మాణాలు పకడ్బందీగా అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నట్లు వారి వివరించారు. పలు దశల్లో ఉన్న భవనాలను ఎప్పటికప్పుడే ఆన్లైన్లో పొందుపరుస్తూ ఉన్నట్లు పంచాయతీరాజ్ ఏఈ పేర్కొన్నారు. నెలవారి స్త్రీనిధి బ్యాంకు లింకేజీ జీవనోపాదులు స్వయం ఉపాధి పలు రకాల ఉపాధి రుణాలు పై సమీక్షలు చేస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి సభలు సమావేశాలు ద్వారా సమీక్షల నిర్వహించేందుకు ఈ నిర్మాణాలు చేస్తున్నట్లు ఏపిఎం, పంచాయతీరాజ్ ఏఈలు పేర్కొంటున్నారు. ఈ నిర్మాణాలు రెండు మూడు నెలల్లో పూర్తిస్థాయిలో పూర్తి చేసేందుకు పర్యవేక్షణ లు చేస్తున్నట్లు వారి వివరించారు.

# వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించి విధుల నిర్వహణపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని వివిధ వార్డులను పరిశీలించి ప్రసూతి వార్డులో చికిత్సలు పొందుతున్న మహిళలతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రాధా మోహన్, సీతారామ్, చైతన్య, తహశిల్దార్ పుల్లయ్య తదితరులున్నారు.

# గుండెపోటుతో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని చెన్నారంలో కమదన కిషన్ రావు (56) అనే వ్యక్తి గురువారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. మృతుడు కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతదేహం ను ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట తిరుమలాపురం సర్పంచ్ కమదన ప్రవీణ్, బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు మాదాసు ఆదాం తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని మండ్రాజుపల్లి శ్రీసీతారామచంద్రాస్వామి దేవాలయం లో గురువారం ధ్వజస్థంభం ప్రతిష్ట మహోత్సవం ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయంలో మహాకుంబాభిషేకం, శాంతి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ను చేశారు. భక్తులు తెల్లవారు జామునుంచే పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంకు హజరైన రాష్ట్ర రెవిన్యూ, గృహా నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొడాలి గోవిందరావు లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహాణ కమిటి వీరిని ఘనంగా సన్మానించారు. భద్రయ్య, మాజీ ఎంపీపీ వజ్జా రమ్య, గ్రామ పెద్దలు వజ్జా శ్రీనివాసరావు, తుమ్మా ఉపేందర్ పాల్గొన్నారు.

# కేటిపిఎస్ ఉద్యోగుల నిరసన



**ప్రజాపక్షం/పాల్వంచ :** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్, కోల్ హ్యాండ్లిగ్ ప్లాంట్ల నిర్వాహణను ప్రవేటు సంస్థలకు అప్పగించటంపై తెలంగాణ ఎలక్రిష్టసిటీ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కేటిపిఎస్‌లోని అంబేద్కర్ సెంటర్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీన్‌కుమార్, భట్టు హరీష్, బి. రవి, రామక్రిష్ణ జాదవ్, సమీర్ అహ్మద్, క్రిష్ణయ్య, రాందాస్, జ్యోత్సన, ఆర్. స్పంధన, నాగరాజు, బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలను సందర్శించిన ఆర్‌జేడీ, డీఈవో



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలంలోని జానంపేట తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రాంతీయ సంయుక్త విద్యా సంచాకులు మదన్ మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి గురువారం సందర్శించారు. వారికి మండల విద్యాశాఖ అధికారి కొమరం నాగయ్య, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. సందర్శన సందర్భంగా అధికారులు పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, బోధన, అభ్యాస ప్రక్రియ, విద్యార్థుల నైపుణ్యాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం పథకం అమలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, సీఆర్‌పీలు, గ్రామ పెద్దలు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యూడెమోక్రసీ పార్టీకి రాజీనామా చేసిన రామన్న

**ప్రజాపక్షం/పాల్వంచ :** సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో ప్రతిఘటన పోరాట దళ కమాండర్‌గా, 2013 నుండి జిల్లా కమిటి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన సింగబోయిన రామన్న సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ వైకే వర్గానికి రాజీనామా చేసిన సింగబోయిన రామన్న పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, జిల్లా కమిటి బాధ్యతలకు రాజీనామా చేసి చంద్రన్న నాయకత్వంలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీలో రాష్ట్ర కమిటి సభ్యులు ఆరెల్లి క్రిష్ణ ఆధ్వర్యంలో చేరుతున్న గురువారం తెలిపారు. ఈ సంధర్భంగా ప్రజాపక్షంతో ఆయన మాట్లాడుతూ 1979 నుండి 46 సంవత్సరాలుగా పార్టీలో క్రియాశీలకంగా పని చేశానని దళ కమాండర్‌గా, రాష్ట్ర కమిటి సభ్యుడిగా ఖమ్మం, వరంగల్ రియా కమిటి కార్యదర్శిగా పని చేశానని దీనిలో భాగంగా పోలీసు దాడులు, అరెస్టులు, నిర్భంధాలు, కుట్రలను సైతం ఎదుర్కొన్నట్లు తెలిపారు. ప్రస్తుత వైకే వర్గం అనుసరిస్తున్న సిద్దాంతాలు, రాజకీయ పద్ధతులు దారి తప్పాయని ఆరోపించారు. దీనితో తీవ్ర మనస్థాపానికి గురై పార్టీకి రాజీనామా చేశానని చెప్పారు.

# కాంగ్రెస్‌వి తుపాకీ రాముడి ముచ్చట్లు



**-హామీల అమలు చేతకాకనే సవాళ్లు**
**-బిఆర్ఎస్ ఎంఎల్‌సిలు తక్కెళ్లపల్లి, తాతా మధు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ సవాళ్లు, మాటలు తుపాకీ రాముడి ముచ్చట్లని పాలన చేతకాక డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని బిఆర్ఎస్ ఎంఎల్‌సిలు తక్కెళ్లపల్లి రవీంద్రరావు, తాతా మధుసూదన్ లు ఆరోపించారు. రెండున్నర ఏళ్లలో నాలుగు లక్షల కోట్ల అప్పు తెచ్చి ఏమి చేశారని వారు ప్రశ్నించారు. గురువారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంపై ఆరోపణలు చేయడంతోనే మంత్రులు సరిపెట్టుకుంటున్నారని ఏ ఒక్క హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగడం లేదన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ప్రకారం రైతు కూలీలకు రూ.12వేలు, కౌలు రైతులకు రూ. 15వేలు, మహాలక్ష్మి పథకం క్రింద రూ.2,500, తులం బంగారం వంటివి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పాలనలో చేసిన అప్పుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని కాంగ్రెస్ తెచ్చిన అప్పుతో ఏమి చేసిందో చెప్పాలని వారు ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రక్షాళన పేరుతో దోచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. చేతగాని సవాళ్లు, దొంగ అరెస్టులతో బిఆర్ఎస్‌ను నిలువరించలేరని వారు తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పే పరిస్థితిలో లేదని అందుకే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని వారు ఆరోపించారు. వ్యక్తిత్వ హననం చేయడం కాంగ్రెస్ పార్టీకే చెల్లిందన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజు, బిఆర్ఎస్ నాయకులు ఆర్‌జెసి కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు పాల్గొన్నారు.

# నాలుగు ఎకరాల వరకు రైతు భరోసా నిధులు జమ

**-2.98 లక్షల మంది రైతులకు నగదు జమ**
**-జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వానాకాలం సీజన్‌కు సంబంధించి నాలుగు ఎకరాల వరకు రైతులకు ప్రభుత్వం రైతు భరోసా క్రింద ఆర్థిక సహాయాన్ని వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంజిల్లాలో మొత్తం 298513 మంది రైతులకు రూ.255.75 కోట్లు రైతు భరోసా నిధులు జమ చేసినట్లు తెలిపారు. ఖమ్మం నియోజక వర్గంలో 16197 మంది రైతులకు రూ.14.69 కోట్లు, పాలేరు నియోజక వర్గంలో 71029 మంది రైతులకు రూ. 5808 కోట్లు, సత్తుపల్లి నియోజక వర్గంలో 74682 మంది రైతులకు రూ.6219 కోట్లు, మధిర నియోజక వర్గంలో 78832 మంది రైతులకు రూ.66.28 కోట్లు, వైరా నియోజక వర్గంలో 56673 మంది రైతులకు



రూ.5378 కోట్లు, ఇల్లందు నియోజక వర్గంలోని కామేపల్లి మండలంలో 1100 మంది రైతులకు రూ.73 లక్షలు జమ చేసినట్లు పుల్లయ్య తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత నిస్తూ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. సాగు ప్రారంభ దశలో రైతులకు అవసరమైన పెట్టుబడి సకాలంలో అందడంతో వ్యవసాయ పనులు వేగవంతంగా చేపట్టేందుకు ఈ పెట్టుబడి సాయం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అర్హులైన ప్రతి రైతుకు ఈ పథకం ద్వారా ప్రయోజనం అందేలా వ్యవసాయ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటుందని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య తెలిపారు.

# వర్షాలు.. వ్యాధులు..!

**- మేక, గొర్రెల పెంపకదారులకు తీరని కష్టాలు**
**మేత కొరతతోపాటు అంటువ్యాధుల భయం..**
**పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు**
**- ప్రభుత్వ సాయం కోరుతున్న రైతులు**





**ప్రజాపక్షం/తల్లాడ:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు మేకలు, గొర్రెల పెంపకదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వర్షాల కారణంగా మేత భూములు బురదమయంగా మారడంతో మందలను మేపడం కష్టంగా మారింది. తడి వాతావరణంతో పశువుల్లో వైరల్, భాక్టీరియా సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, పెంపకదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తడి గడ్డి ఎక్కువగా తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు, విరేచనాలు, జ్వరం, కాళ్ల వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. చిన్న మేకలు, గొర్రె పిల్లలు చలి, తేమ కారణంగా త్వరగా అనారోగ్యానికి గురవుతున్నాయని, పశువైద్య నిపుణులు చెబుతున్నారు. వర్షాల వల్ల పశువుల షెడ్లలో నీరు నిల్వ ఉండటం, తేమ పెరగడం వల్ల దోమలు, ఈగలు, క్రిములు అధికంగా పెరుగుతున్నాయి. దీంతో అంటువ్యాధులు వేగంగా వ్యాపించే పరిస్థితి ఏర్పడుతోంది. పశువైద్య సేవలు అన్ని గ్రామాల్లో అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. మేత కొరతతో ఎండు గడ్డి, దాణా ధరలు భారీగా పెరగడంతో పెంపక వ్యయం పెరిగింది. మార్కెట్లకు పశువులను తీసుకెళ్లడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతుండటంతో సరైన ధరలు లభించడం లేదని రైతులు వాపోతున్నారు. కొన్నిచోట్ల పశువుల మరణాలు కూడా నమోదవుతున్నాయని సమాచారం. ప్రతీ గ్రామంలో ప్రత్యేక పశువైద్య శిభిరాలు నిర్వహించాలని, ఉచిత మందులు, టీకాలు, అందించాలని, అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మేత అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, షెడ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాకాలంలో పశువుల షెడ్లను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవడం, శుభ్రమైన తాగునీరు అందించడం, సమయానికి టీకాలు వేయించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. మేకలు, గొర్రెల పెంపకం గ్రామీణ కుటుంబాలకు ప్రధాన జీవనాధారం కావడంతో ఈ రంగాన్ని రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. సకాలంలో సహాయం అందితే నష్టాలను గణనీయంగా తగ్గించొచ్చని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# నాలుగో రోజుకు చేరిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి అధికారుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సిఎంఓఏఐ) ఎస్ సి సి ఎల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సత్తుపల్లి ఏరియాలో గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి.



దీక్షా శిబిరంలో పాల్గొన్న అధికారులకు తోటి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, సంస్థ అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న అధికారుల సమస్యల పట్ల యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని వీడి వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. అధికారుల ప్రధాన డిమాండ్లలో పెండింగ్‌లో ఉన్న పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పి ఆర్ పి) బకాయిలను తక్షణమే విడుదల చేయడం, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పే అప్‌గ్రేడేషన్‌ను అమలు చేయడం ముఖ్యమైనవని పేర్కొన్నారు. యాజమాన్యం సత్వరమే చర్చలకు ముందుకు వచ్చి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో జూలై 13 వరకు నిరంతరాయంగా రిలే నిరాహార దీక్షలను కొనసాగించడంతో పాటు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సంఘ నాయకులు హెచ్చరించారు.

# కారు విలువ చెల్లించాల్సిందే..

**-వినియోగదారుల న్యాయస్థానం తీర్పు**

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** ప్రమాదంలో దెబ్బతిన్న కారు విలువ చెల్లించడంతో పాటు అదనంగా రూ. 30వేలు జరిమానా చెల్లించాలని ఇన్సూరెన్స్ కంపెనీకి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ గురువారం తీర్పు వెలువరించింది. కేసు వివరాల్లోకి వెళితే... రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మద్దినేని ఉపేందర్ హ్యూండాయ్ కారును కొనుగోలు చేశాడు. తిరుమలాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఆర్టిసి బస్సు ఢీ కొట్టడంతో కారు నుజ్జు నుజ్జు అయింది. డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. కారును హ్యూండాయ్ సర్వీస్ సెంటర్‌కు తరలించగా రూ.10లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. కారుకు లిబర్టి జనరల్ ఇన్సూరెన్స్ బీమా పాలసీ ఉండడంతో సదరు కంపెనీ ప్రతినిధులను సంప్రదించారు. ప్రమాదం జరిగినప్పుడు కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని దినపత్రిలో వచ్చిన వార్తను చూపిస్తూ క్లెయిమ్‌ను తిరస్కరించారు. న్యాయవాది కొండపల్లి శ్రీనివాస్ చౌదరి ద్వారా వినియోగదారుల ఫోరంలో కేసు దాఖలు చేయగా కమిషన్ ప్రెసిడెంట్ వి. లలిత , సభ్యురాలు ఎ. మాధవిలత బీమా కంపెనీ సేవా లోపాన్ని తెలియజేస్తూ ఇన్సూరెన్స్ ద్వారా పైన విధించిన కారు విలువతో పాటు రూ.30వేలు జరిమానా చెల్లించాలని తీర్పునిచ్చారు.

# వాహనాల పార్కింగ్‌లో సూచనలు పాటించండి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నూతన బస్టాండ్‌లో వాహనాల పార్కింగ్‌కు సంబంధించి అధికారుల సూచనలు పాటించాలని ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ గురువారం తెలిపారు. నూతన బస్టాండ్‌లో పార్కింగ్ క్రమబద్ధీకరణ కొరకు బస్టాండ్ సిబ్బందితో సర్వే చేపట్టడం జరిగిందని డిఎం తెలిపారు. ఈ సర్వేలో కొన్ని విషయాలు బస్టాండ్ యజమాన్యం దృష్టికి వచ్చాయన్నారు. ఊరికి వెళ్లే వారు, ఖమ్మం నగరంలో ఇతర పనులకు వెళ్లే వారు కార్గో, ప్యాసింజర్ డ్రాపింగ్ కొరకు ఇచ్చిన పార్కింగ్ స్థలాల్లో సుమారు రెండు నుంచి 12 గంటల వరకు తమ వాహనాలు నిలుపుతున్నట్లు సర్వేలో గుర్తించినట్లు తెలిపారు. దీని వల్ల ప్రయాణికులను దింపేందుకు, ఎక్కించుకునేందుకు వచ్చేవారు, కార్గో బుకింగ్ కొరకు వచ్చే వారికి వాహనాలు పార్క్ చేయుటకు స్థలం లేక తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. కొంత మంది ఇట్టి పార్కింగ్‌ను దుర్వినియోగం చేయడం వల్ల ట్రాఫిక్ జామ్ అయి ప్రమాదాలకు కారణం అవుతున్నాయని భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. బస్సులో ప్రయాణించే ప్రయాణికులు ఇట్టి పార్కింగ్ స్థలాల్లో రెండు గంటల కంటే ఎక్కువ పెట్టి వెళ్లిన వారి వాహనాలను గమనించడం జరుగుతుందని తరచుగా పెట్టే వారికి జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. బస్సుల్లో ప్రయాణించుట కొరకు వచ్చిన ప్రయాణికులు వారికి కేటాయించిన పార్కింగ్ సెల్లార్‌లలో మాత్రమే పార్కింగ్ చేయాలన్నారు. కార్గో పాయింట్, ప్యాసింజర్ పికప్ అండ్ డ్రాపింగ్ కొరకు వచ్చిన వారు వారికి కేటాయించిన కార్గో పాయింట్ ముందు ఉన్న స్థలంలో పార్కు చేయాలని డిఎం సూచించారు. ఖమ్మం నూతన బస్టాండ్‌లో ప్రయాణికులకు మరింత మెరుగైన సురక్షితమైన సేవలు అందించేందుకు ఇట్టి సూచనలను పాటిస్తూ ప్రయాణికులు, ప్రజలు సహకరించాలన్నారు.

# బోధనా వృత్తి పవిత్రమైంది..

**ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**



**ప్రజాపక్షం/వైరా:** అన్ని వృత్తుల్లోకి టీచర్ వృత్తి పవిత్రమైందని, సమాజానికి అవసరమైన అన్ని రంగాల వ్యక్తులు ఉపాధ్యాయుల చేతుల్లో నుండే వస్తారని అందుకే ఆచార్యదేవోభవ అని మన సమాజం ఉపాధ్యాయ వృత్తికి ఆ తాంబూలా ఇచ్చిందని వైరా శాసనసభ్యులు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. వైరా మండలం రెబ్బవరం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కొత్తపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన పాఠశాల సాంఘిక శాస్త్రి సహాయకులు, ఖమ్మం జిల్లా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు దొడ్డా వరప్రసాద్ పదవీవిరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ దొడ్డా వరప్రసాద్ చేసిన సేవలను కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ దొడ్డా వరప్రసాద్ చేసిన సేవలను కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సదనందం గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలందిస్తూ పూర్తి సమయ బోధనలో గడిపిన ప్రసాద్ ధన్యజీవి అని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో వైరా మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు, సంబాద్రి అర్బన్ డవలప్‌మెంట్ చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, తులసి, గ్రామ ఉప సర్పంచ్ పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్కెట్ చైర్మన్ గంగారావు, పలువురు ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీవారి ఆలయంలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అలివేలు మంగ, శావాలయం, పద్మావతి దేవి ఆలయాల్లో గురువారం నూతన ధ్వజస్తంభములు అత్యంత వైభవంగా భక్తుల గోవింద నామస్మరణల మధ్య ప్రతిష్ట అంగరంగ వైబవంగా జరిగింది. జూన్29 నుంచి జీర్ణోదరణ ధ్వజ ప్రతిష్టా సహిత మహా కుంబాభిషేక కార్యక్రమాలు శ్రీ శృంగేరి శారదా పీఠం జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ మహా స్వామి వారి ఆశీస్సులతో నిర్వహిస్తున్నారు. 29వ తేదీన ఉపముఖ్యమంత్రి భట్టీ విక్రమార్క దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. 30వ తేదీన ధ్వజస్తంభముల శోభాయాత్ర గ్రామంలో నిర్వహించారు. 3వ తేదీన ఉదయం 9గంటల నుంచి శ్రీ శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి వారిచే మహా కుంబాభిషేకం సంప్రోక్షణ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 4వ తేదీ శనివారం శాంతి కల్యాణం, గోవృషభ కల్యాణములు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.వీరస్వామి, ఈఓ కొత్తూరు జగన్మోహనరావు, ఛైర్మన్ ఉప్పల విజయ దేవశర్మ, ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మ, వకుళమాత స్టేడియం నిర్మాణ దాత తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మల కుమారి దంపతులు, వైద్యులు రేష్మ సృసేన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.